క్లుప్తంగా

ముమ్మరంగా వ్యవసాయ పనులు



వరి నారు తీస్తున్న మహిళా రైతులు

సీతానగరం: మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల కేంద్రమైన సీతానగరంతో పాటు సమీప గ్రామాల్లో దమ్ము పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ విషయమై ఏఓ అవినాష్ మాట్లాడుతూ, వరి ఉబాలకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయని చెప్పారు.

రక్షకభటులకే రక్షణ కరువు



పాడైన ట్రాఫిక్ పాయింట్

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్ పాయింట్ అత్యంత దారుణంగా తయారైంది. ఎప్పుడు పడిపోతుందో తెలియక పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొత్త పాయింట్ ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ పోలీసులు, ప్రజలు కోరుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలి

- గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్



పార్వతీపురం టౌన్: జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరచాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, నిధులు అందుబాటులో ఉన్నా భవన నిర్మాణాలు, ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తి చేయడం లేదన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు.. రిఫరల్ కేసులు తగ్గించేందుకు పాలకులు, అధికారులు కృషి చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాలకొండ రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ శివారులో జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సిబ్బందితో కలిసి ఆదివారం పికెట్ నిర్వహిస్తుండగా పేకాట ఆడుతున్నవారిని చూసి పట్టుకున్నట్లు ఎస్సై చెప్పారు. వారి నుంచి రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

సస్యరక్షణపై అవగాహన

పాలకొండ రూరల్: వరి పంట కీలక దశలో ఆశించి కాండంతొలుచు పురుగు నివారణపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి అన్నారు. మండలంలోని డోలమడ, జంపరకోట, ఎం.సింగుపురం తదితర ప్రాంతంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. నారుమడి దశ నుంచి ఈనిక దశ వరకూ కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు, ముదురు నారు వినియోగించటం వలన, నత్రజని ఎరువులు అధికంగా వాడినా ఈ పురుగు ఆశిస్తుందన్నారు. దీని కారణంగా నారుమడిలో పిలక దశలో మొవ్వు చనిపోవటం, ఈనిక దశలో కంకి పాలు పోసుకోకపోవటం, తెల్ల కంకి వంటివి చోటుచేసుకుంటాయని తెలిపారు. నారు మడుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ 800 గ్రాములు మడిలో పలుచగా ఇంకేటట్లు చల్లుకోవాలని సూచించారు. పిలక దశలో అవే గుళికలు ఎకరాకు 10 కేజీలు వాడుకోవచ్చు. సమస మరింత ఉధృతంగా ఉంటే అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాల్సి ఉంటుందన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

భామిని: ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంఘ నాయకులు ఎం.తిరుపతిరావు పిలుపు నిచ్చారు. భామిని మండలం డోకులగూడలో గిరిజన సంఘ మండల అధ్యక్షుడు కొండగొర్రి మిన్నారావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. గిరిజనుల సమస్యలపై, ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. ఐటీడీఏ పరిధిలో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.

29న మూడోవిడత కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మూడోవిడత కౌన్సెల్సింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, 27న ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 29న కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానికల్, కోపా, డ్రెస్ మేకింగ్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

విద్యారంగంపై కూటమి గ్రహణం..

- అభివృద్ధికి నోచుకోని పాఠశాలలు
- చాలీచాలని యూనిఫారాలు
- మధ్యాహ్న భోజనం మెనూ అమలులో నిర్లక్ష్యం

పార్వతీపురం టౌన్:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యారంగంపై నీలినీడలు అలముకున్నాయి. విద్యాభివృద్ధితోనే సామాజిక అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారు. పాఠశాలలకు కావాల్సిన అదనపు భవనాలు మంజూరు చేయడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలు, షూలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందజేసి విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందారు. అయితే రెండు నెలల కిందట కూటమి ప్రభుత్వం ఏర్పటైనప్పటికీ ఇంతవరకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయలేకపోయారు. అలాగే యూనిఫారాలు, షూల పంపిణీలో కూడా కొన్ని కొన్ని ఇబ్బందులేర్పడ్డాయి.

మెనూ అమలు అంతంతమాత్రమే..

పార్వతీపురం నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే మెనూ సక్రమంగా అమలు కావడం లేదని సమాచారం.

కొలతలు తారుమారు..

ఇదిలా ఉంటే విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫారాలు, పుస్తకాలు అందజేసినప్పటికీ, పూర్తిస్థాయిలో అందలేదని సమాచారం. అలాగే విద్యార్థులకు షూలు అందజేసేందుకు ముందస్తుగానే కొలతలు తీసినప్పటికీ, చాలామందికి చాలీచాలని షూలు రావడంతో బయట కొనుగోలు చేయాల్సి వచ్చిందని చెబుతున్నారు.



పార్వతీపురం బ్రాంచ్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం అందుకుంటున్న విద్యార్థులు

పార్వతీపురంలో పాఠశాలల వివరాలు..

మండలం	పార్వతీపురం	బలిజిపేట	సీతానగరం	సాలూరు	మక్కువ
పాఠశాలలు	115	60	60	172	84
విద్యార్థులు	8500	3170	3400	10305	4689



సాలూరు: పట్టణంలో అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు భవనం



మక్కువ మండలం కె.పెద్దవలసలో రేకుల షెడ్‌లో 1 నుంచి 5 తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్ మోహనరావు

పార్వతీపురం టౌన్: ఐటీడీఏ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.జగన్ మోహనరావు అన్నారు. ఆదివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, 2024 జనవరి నుంచి ఇప్పటివరకు పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 600 మలేరియా కేసులు నమోదైనట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని 20 పీహెచ్‌సీలలో ఎక్కువగా దుడ్డుఖల్లు, మాదలంగి, రేగిడి, తోణాం, నీలకంఠాపురం పీహెచ్‌సీలలో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 90 వేల మలేరియా పరీక్షలు నిర్వహించమన్నారు. ఐటీడీఏ పరిధిలో ఇప్పటివరకు 12 డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు. తొలిదశలో 350 గ్రామాల్లో మలేరియా నివారణ మందు పిచికారీ చేశామని, రెండోదశ ఈ నెల 31లోగా పూర్తి చేస్తామన్నారు. ఐటీడీఏ పరిధిలో రక్తహీనత బాధితులు ఎక్కువగా ఉన్నారని, ఇప్పటివరకు 160 మంది బాధితులను గుర్తించి రక్తనమూనాలను సేకరించామని తెలిపారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్ మోహనరావు

ఘనంగా ప్రపంచ స్నేహితుల దినోత్సవం

పార్వతీపురం టౌన్: సర్వకాల, సర్వావస్థల్లో స్నేహితుడి కంటే గొప్పవాడు లేడని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ జె.నారాయణస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల కంటే స్నేహితులకే కష్టసుఖాలు చెప్పుకుంటామన్నారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్న నేపథ్యంలో స్నేహమనే బంధం బలపడుతోందని చెప్పారు. అనంతరం సమాజ సేవకుడు కె. కృష్ణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో గున్నేష్, పి. సత్యనారాయణ, ఆర్. సత్యంనాయుడు పాల్గొన్నారు.



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు

మక్కువ: స్థానిక సాయి రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న చౌడేశ్వరిదేవి అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మణికంఠ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కుంకుమ పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన మహిళలు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో సుమారు 2వేల మందికి అన్న సమారాధన చేశారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నిబంధనలకు విరుద్ధంగా తొలగింపు

బలిజిపేట: మురగడాం వీఓఏను నిబంధనలకు విరుద్ధంగా తొలగించడంపై మహిళా సంఘాలలో చర్చ మొదలైంది. రాజకీయ వేధింపులు ప్రారంభమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన వీఓఏ ఆర్.విద్యను సంఘాల ఆమోదం, తీర్మానం లేకుండా ఎలా తొలగించారనేది చర్చనీయాంశమైంది. గ్రామంలో 15 మహిళా సంఘాలున్నాయి. వీటిలో 160 మంది వరకు సభ్యులున్నారు. ఆయా సంఘాలకు సంబంధించిన పనులన్నీ వీఓఏ విద్య ఎంతో సమర్థవంతంగా చేస్తోందని, అయినప్పటికీ తొలగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈమె పనితీరుపై మహిళా సంఘాల తరఫున అధికారులకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. ఈ విషయమై ఏపీఎం ఉమామహేశ్వరరావు వద్ద ప్రస్తావించగా... సభ్యుల తీర్మానం మేరకు ఆమెను తొలగించడం జరిగిందని తెలిపారు. గ్రూపుల వారే వీఓఏను ఎంపిక చేసుకుంటారని తెలిపారు.



మురగడాంలో సమావేశమైన మహిళలు

విద్య అందించడం అభినందనీయం

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో గల దయానంద సరస్వతి సేవా ఆశ్రమంలో తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచితంగా విద్య, వసతి కల్పించడం అభినందనీయమని గుడివాడ ప్రణవాశ్రమం పీఠాధిపతి స్వామి స్థర్యానంద సరస్వతి అన్నారు. స్వామి దయానంద సరస్వతి 94వ జయంతి పుస్కరించుకుని ఆదివారం స్థానిక సేవాశ్రమం మేనేజర్ నల్లా సురేష్ ఆధ్వర్యంలో ముందుగా వరసిద్ధి వినాయక పూజ, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి స్థర్యానంద సరస్వతి మాట్లాడుతూ.. ఆశ్రమంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధన అందించడం గొప్ప విషయమన్నారు. డాక్టర్ కర్రి సత్యనారాయణ, జిల్లా ఆర్య వైశ్యసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మమ్ముల విశ్వేశ్వరరావు, ఆరిశెట్టి వెంకట సత్యనారాయణ, కూర్మదాసు లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఆశ్రమంలో విద్యార్థులకు తమ వంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే దాతలు కర్రి సత్యనారాయణ, చంద్రినాయుడు, తదితరులు విద్యార్థుల కోసం పుస్తకాలు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ సభ్యులు పి. శ్రీనివాసరావు, సాలా వెంకటప్పారావు, గోనా ప్రసాదరావు, కొత్తా రవికుమార్ పాల్గొన్నారు.



స్వామి స్థర్యానంద సరస్వతికి నోట్‌బుక్స్ అందజేస్తున్న దాతలు

విరాళాల సేకరణ

సీతానగరం: కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలో ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు దాతలు విరాళాలు ఇచ్చి సహకరించాలని సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు కోరారు. కేరళ వరద బాధితుల సహాయార్థం మండల కేంద్రంలో ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేకరించిన మొత్తాన్ని పార్టీ తరఫున కేరళకు పంపించి బాధితులకు అందజేస్తామని చెప్పారు. విరాళాలు సేకరించిన వారిలో సీఐటీయూ జిల్లా నాయకుడు గవర వెంకటరమణ, ఐద్వా జిల్లా అధ్యక్షుడు వెన్నెల రామలక్ష్మి, రైతు సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా నాయకులు బి. అప్పారావు, ఆర్. రాము, సీహెచ్ కృష్ణ, పి.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఆగని ఇసుక అక్రమ రవాణా..



బిల్లుమడ వద్ద ఇసుక లారీను అడ్డుకుని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

పాలకొండ రూరల్: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నా యి. భామిని మండలం బిల్లుమడ, నేరడి గ్రామాల మధ్య శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను బిల్లుమడ గ్రామస్తు లు అడ్డుకున్నారు. నిత్యం రాత్రి 10 నుంచి వేకువ జాము వరకూ ఇసుకను లారీల్లో విశాఖ తరలిసున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇదే తంతు నిత్యం జరుగుతుందని, పదుల సంఖ్యలో లారీల రాకపోకలతో ప్రమాద లు సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. యువత మరింత గట్టిగా పట్టుబట్టి డ్రైవర్లను ప్రశ్నించటంతో లారీలు వెనుకకు మళ్లాయి. ఈ సమయంలో యువత తమ సెల్ ఫోన్లలో తీసిన వీడియో లు సోషల్ మీడియాలో ఆదివారం హల్‌చల్ చేశాయి. అయినా అధికారులు పట్టించుకునే పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

వంశధార నదీ తీరం నుంచి ఇసుక తరలింపులు పెద్ద ఎత్తున జరుగుతున్న ట్లు ఇటీవల పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ఇసుక తరలిస్తున్న ప్రాంతాలను సందర్శించారు. ఈ తర హా చర్యలకు ఎవరూ పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అయినా ఫలితం లేకపోయిందని, ఉన్నతాధికారులు దీనిపై స్పందించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

మక్కువ రోడ్డు పూర్తయ్యేదెప్పుడు?

- అధ్వానంగా సాలూరు–మక్కువ రోడ్డు
- తరచూ మోరాయిస్తున్న వాహనాలు

సాలూరు: సాలూరు–మక్కువ రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని ఈ ప్రాంత ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గోతులతో నిండిన ఈ రోడ్డులో ప్రయాణం చేసేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతల్లో నీరు చేరడంతో వాహనచోదకులు వాటిని గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.

రూ.55.56 కోట్ల అంచనాతో..

సాలూరు నుంచి మక్కువ వరకు 19.60 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.55.56 కోట్లు అంచనా విలువతో ప్రతిపాదనలు పంపించగా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపింది. రూ.38.52 కోట్లు అంచనా విలువైన పనులు ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో 2021 మార్చి 1న ప్రారంభించారు. ఇందులో భాగంగా 6 కిలోమీటర్లు మెటల్ లేయర్ వేశారు. 32 కల్వర్టులకు గాను 16 కల్వర్టులు, 8 మైనర్ బ్రిడ్జిలకు గాను 3 బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు చేపట్టాల్సి ఉంది.

పారాది వంతెన నిలుపుదలతో పెరిగిన రద్దీ..

విజయవాడ తరువాత అతిపెద్ద లారీ పరిశ్రమ సాలూరులో ఉంది. సాలూరు నుంచి వేలాది లారీలు వివిధ రాష్ట్రాలకు సరుకులను ఎగుమతి, దిగుమతి చేస్తుంటాయి. ఎక్కువగా ఒడిశా రాష్ట్రం ఝూర్సుగూడ వైపు వెళ్తుంటాయి. అవన్నీ పారాది, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా ఒడిశాకు వెళ్తుంటాయి. అయితే కొన్ని నెలలుగా పారాది వంతెన మరమ్మత్తులకు గురవడంతో భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వాహనాల రాకపోకల కోసం వంతెన పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కూడా కోతకు గురికావడంతో సాలూరు–మక్కువ రోడ్డు మీదుగా పార్వతీపురం వైపు వెళ్తున్నాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ మరింత పెరిగింది. ఇప్పటికే గుంతలమయమైన ఈ రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా తయారైంది. తరచూ రోడ్డు మధ్యలోనే లారీలు మోరాయించి నిలిచిపోతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సాలూరు, మక్కువ మండలాల ప్రజలు కోరుతున్నారు.



సాలూరు–మక్కువ రోడ్డులో మరమ్మతులకు గురై నిలిచిపోయిన లారీ



పెద్ద పెద్ద గోతులతో స్వాగతం పలుకుతున్న సాలూరు–మక్కువ రోడ్డు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

భామిని: మండలంలోని ఘనసర కాలనీలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ కిల్లారి కమల, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లోని పూడికలు తొలగించారు. వ్యర్థాలను ట్రాక్టర్‌పై డంపింగ్‌యార్డుకు తరలించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

అక్షరబ్రహ్మ ఉద్యమం కొనసాగించాలి

భామిని: సవర భాషా లిపి ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయాలని శ్రీఅక్షరబ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం ప్రచారకులు ఆదివారం పిలుపునిచ్చారు. మండలంలోని మనుమకొండ అక్షరబ్రహ్మ ఆలయ సమీపంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..సవరభాష, లిపి కనుమరుగు కాకుండా విస్తృతంగా ప్రచారం చేయాలని, భాషాభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురం ఏరియా పెద్దగూడ బ్రాంచ్ ఏరియా కోఆర్డినేటర్ ఆనందరావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏవైఎస్ డైరెక్టర్లు కామేశ్వరరాం, తిరుపతి, ముత్యాలు, అడ్డాయి, బాంబు, పొట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

సీతానగరం: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎంఆర్‌పీఎస్ నాయకులు తెలిపారు. ఈమేరకు మండలంలోని లచ్చయ్యపేటలో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహిచారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ ప్రతినిధి జి. మోహనరావు మాట్లాడుతూ.. దశాబ్దాల తరబడి చేసిన పోరాటం ఫలించిందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జి, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, జి.వరప్రసాద్, ఎం. కృపారావు, ఎం. పకీరు, ఎం.రవి పాల్గొన్నారు. సీతానగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పులి డేవిడ్‌మాదిగ, సీనియర్ నాయకుడు సవరపు రామారావు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా మాదిగ కులస్తులు చేస్తున్న పోరాటానికి దేశ అత్యున్నత న్యాయస్థానం అనుకూలంగా తీర్పు వెలువరించడం హర్షణీయమన్నారు.



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు

ఏరియా ఆస్పత్రిలో బెడ్‌ల కొరత

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో బెడ్‌ల కొరత వేధిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అన్నారు. గిరిజన సంఘ సభ్యులతో కలిసి ఆదివారం ఆస్పత్రిని స్వయంగా సందర్శించారు. రోగులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు ఉండి చికిత్స పొందే పరిస్థితి ఉందన్నారు. బెడ్‌లు అందుబాటులో లేకపోవడంతో రిఫరల్ కేసులు పెరుగుతున్నాయన్నారు.

అదనపు భవనాలు సకాలంలో పూర్తికాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేసి అదనపు బెడ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.సాంబయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి విష జ్వరాల బారి నుంచి గిరిజనులను కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జ్వరపీడితులతో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం కిటకిటలాడుతోందని, సరిపడా బెడ్లు అందుబాటులో లేకపోవడంతో ఒక్కో బెడ్డుపై ముగ్గురు చొప్పున రోగులు చికిత్స తీసుకుంటున్నారన్నారు. గిరిజన గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నా వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. గిరిజన గ్రామాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు.

'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి: స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న 'చదవడం మాకిష్టం' కార్యాక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో పద్యాలు, నవలలు, నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు ఎన్.మధుసూదనరావు విద్యార్థులకు వివరించారు. ప్రముఖ సంఘ సంస్కర్తల జీవిత చరిత్రను, సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు వారు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో బొమ్మలు వేయించడం, ఆటలు ఆడించడం వంటి కృత్యాలు నిర్వహించారు.